క్లుప్తంగా

ప్రజా వైద్యాన్ని విస్మరించిన ప్రభుత్వం

అరకులోయ రూరల్: ప్రజలకు వైద్య సేవలందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైనట్టు సీపీఎం మండల కార్యదర్శి కె.రామారావు చెప్పారు. మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిని పార్టీ నాయకులతో కలిసి బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యం కోసం గంటల తరబడి రోగులు బారులు తీరారని, కనీస వైద్యం అందని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లల వార్డులో టైఫాయిడ్‌తో బాధపడుతున్న పాంగి అక్షిత్‌ను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు సక్రమంగా వైద్యసేవలందడం లేదన్నారు. నాయకుడు మగ్గన్న తదితరులున్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు మోహన్‌బాబు

జి.మాడుగుల: జి.ఎం.కొత్తూరులోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ వసతి గృహం-2లో బుధవారం 20 మంది అనాథ విద్యార్థులకు ఆశ్రమ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ మోరి మోహన్‌బాబు తన సొంత సొమ్ముతో దుస్తులు పంపిణీ అందజేశారు. గతంలో కూడా ఆయన పలు సేవా కార్యక్రమాలు చేసినట్టు పలువురు ఉపాధ్యాయులు తెలిపారు.

అనారోగ్యంతో టీచర్ మృతి



రమణమ్మ (ఫైల్)

డుంబ్రిగుడ: మండలంలోని అరకు పంచాయతీ అరకు సంత గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శెట్టి రమణమ్మ (48) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. దీంతో ఆమె స్వగ్రామమైన హుకుంపేట మండలంలోని అడ్డుమండ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉపాధ్యాయురాలు శెట్టి రమణమ్మ మృతికి ఉపాధ్యాయుల సంఘాల నాయకులు, సహచర సిబ్బంది, ఉపాధ్యాయులు సంతాపాన్ని తెలిపారు.

ఆత్మీయ సన్మానం



తహసీల్దార్ నాగరాజును సన్మానిస్తున్న సిబ్బంది

వై.రామవరం: మండల తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై ఏలూరు జిల్లా నిడమూరు మండల తహసీల్దార్‌గా వెళ్తున్న ఎస్.నాగరాజుకు శాలువా కప్పి స్థానిక కార్యాలయ సిబ్బంది, సహచరులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన అందించిన సేవలను కొనియాడారు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కె.సుధాకరరావుకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించి ఆయన రిలీవ్ అయ్యారు. సర్వేయర్ వేణుగోపాల్, సీనియర్ అసిస్టెంట్ ఎ.తాతా రెడ్డి, ఆర్ఐ గీతవిలాప, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరాపురంలో తాగునీటి బోరు ఏర్పాటు



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న జమాల్‌ఖాన్

చింతూరు: మండలంలోని వీరాపురంలో జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును ట్రస్ట్ వ్యవస్థాపకుడు జమాల్‌ఖాన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరు లేకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్టు గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే బోరును వేయించి తాగునీటి సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. మారుమూల గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకొస్తే నీటి సమస్యను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. ట్రస్ట్ సభ్యులు షాజహాన్, రియాజ్, నటరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా

- వాడవాడలా జాతీయ జెండాతో ర్యాలీలు
- తరలివచ్చిన విద్యార్థులు

అరకులోయ రూరల్: జిల్లా వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాడవాడలా జాతీయ జెండాతో ర్యాలీలు చేపట్టారు. ఇందులో భాగంగా అరకులోయలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ జెండాకు గౌరవ వందనం చేసి దేశభక్తి చాటుకున్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి, అనితకుమారి, సిబ్బంది లచ్చన్న, కామేశ్వరావు, సునీల్, సోంబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్వాతంత్ర దినోత్సవం నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఏవో ఉదయ్‌భాస్కర్ బుధవారం తెలిపారు.

డుంబ్రిగుడ: కించుమండ వారపు సంతలో బీజేపీ మండల అధ్యక్షుడు కె.రమేష్ ఆధ్వర్యంలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు.

సీలేరు: జి.కె.వీధి మండలం సీలేరులో సీఆర్‌పీఎఫ్ డి -42 బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాతో సీలేరు మార్కెట్ నుంచి రామాలయం మీదుగా ర్యాలీ చేపట్టారు. అనంతరం రామాలయం సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవించాలన్నారు. స్థానిక ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డి.శ్రీను మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సర్పంచ్ దుర్గో, ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో జాతీయ జెండాతో చిన్నారులు



సీలేరులో జాతీయ జెండాతో విద్యార్థుల మానవహారం

చింతపల్లి: మండల కేంద్రంలో స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు విజయకుమారి, విజయభారతి ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాతో పాత బస్టాండ్ మార్కెట్ మీదుగా హనుమాన్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో విజ యసాయిబాబు, ఎంఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టారు. డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఆవిష్కరించాలని బీజేపీ నేత భారతి కోరారు. అనంతరం విద్యార్థులు స్థానిక కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో గురువారం జరిగే పంద్రాగష్టు వేడుకల్లో ప్రధానోపాధ్యాయులే జెండా ఎగుర వేయాలని ఎంఈఓ సూరయ్యరెడ్డి అన్నారు. ఈ మేరకు కలెక్టర్ నుంచి ఆదేశాలు అందాయన్నారు. ఆయా స్కూల్ యాజమాన్యాల వారు ఈ నియమాలు పాటించాలన్నారు.

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులు జాతీయ జెండాతో ర్యాలీని నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, క్రీడాపోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, అధ్యాపకులు శేఖర్, వెంకట్రావు, పద్మ, శైలజ, శకుంతల పాల్గొన్నారు.



అరకులోయలో జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న కళాశాల సిబ్బంది



డుంబ్రిగుడలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, విద్యార్థులు

హుకుంపేట: స్వాతంత్ర్య దినోత్సవం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులందరూ పాల్గొవాలని జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం కోరారు. ఆయన బుధవారం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎంపీ డాక్టర్ తనూజారాణి ఆదేశాల మేరకు పంద్రాస్టు వేడుకల్లో పార్టీ శ్రేణులంతా పాల్గొవాలని కోరారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాకరి బొంజుబాబు, సర్పంచ్‌లు ధనసాని సత్యవతి, కొప్పుల దేవుడమ్మ, చిన్నయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, నాయకులు లక్ష్మయ్య, మురళి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రవిబాబును కలిసిన అరకు ఎంపీ



ఎమ్మెల్సీ కుంభా రవిబాబు దంపతులకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ తనూజరాణి దంపతులు

అరకులోయ రూరల్: ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబును విశాఖలోని అతని నివాసంలో బుధవారం అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి, వినయ్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. అరకు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో పార్టీ స్థితిగతులు, ప్రధాన సమస్యలపై చర్చించినట్టు వారు చెప్పారు.

డ్రగ్స్ నియంత్రణే ప్రధాన ధ్యేయం



మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

రాజవొమ్మంగి: స్థానిక పోలీసుస్టేషన్‌లో కమ్యూనిటీ బిల్డింగ్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ గంజాయి తదితర మాదకద్రవ్యాలను అరికట్టడమే ప్రధాన ధ్యేయమన్నారు. సమాజంలో జరుగుతున్న రుగ్మతలను రూపుమాపేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని కూడా అభ్యర్థిస్తున్నామన్నారు. ఎస్ఐ వెంకయ్య, ఎంఈవో సూరయ్యరెడ్డి, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



కూనవరంలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ వనజాక్షి



వనుగుమ్మలో బాల వివాహాల అనర్థాలపై ర్యాలీలో అంగన్‌వాడీ సిబ్బంది, గిరిజనులు

కూనవరం: మండలంలోని కోతులగుట్ట కేజీబీవీ, అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజాక్షి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ సెక్టార్ పరిధిలోని జగ్గవరం, చూచిరేలగూడెం, పైదిగూడెం, పైదిగూడెం కాలని, భైరవపట్నం, బోదునూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో 11 నుంచి 18 ఏళ్ల నిండిన బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఇతరత్రా సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో బేటి బచావో భేటి పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి, పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.రాజేశ్వరి మాట్లాడుతూ బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. ఆడపిల్లకు 21 వయస్సు వస్తేనే వివాహం చేయాలని, చిన్న వయసులో వివాహాల వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఉంటుందని, చిన్న వయస్సులో వివాహాలతో మాతాశిశు మరణాలు సంభవిస్తాయని, ఈ కారణంగా బాల్య వివాహాలు చేయవద్దని సూచించారు. అంగన్వాడీలు సూరమ్మ, సువర్ణ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమం



వై.రామవరంలో శిక్షణ తరగతులకు హాజరైన వారితో ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి గత మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ చట్టం, పంచాయతీల పాలన, విధి విధానాలు తదితర అంశాలపై డిజిటల్ శిక్షణ ఇచ్చారు. ఈఓపీఆర్‌డీ డి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎన్ఐఆర్‌డీ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలభివృద్ధి కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ చట్టాలు, హక్కుల గురించి అవగాహన కల్పించామన్నారు. ఈవోపీఆర్డీ నరసింగరావు, మండల పరిషత్ పర్యవేక్షకులు సిద్దేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిల్వర్‌ఓక్ మొక్కల పంపిణీ

పెదబయలు: జామిగుడ పంచాయతీ పరిధిలోని రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలను ఉపాధి సిబ్బంది బుధవారం పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలోని గుంజివాడ, పినరావెలి, తారాబు, కంఠవరం గ్రామాలకు చెందిన 18 మంది రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలు, ఐదుగురు రైతులకు జీడిమామిడి 12,600 మొక్కలను పంపిణీ చేశారు. ప్లాంటేషన్ సూపర్ వైజర్ పి.సింహాచలం మాట్లాడుతూ రైతులకు మొక్కలను కాపాడుకోవాలని, కంచె ఏర్పాటు చేసి మొక్కలకు రక్షణ కల్పించాలని సూచించారు. టీఏ పి.చంద్రకళ, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్పంచ్‌ల సంఘం నూతన కార్యవర్గం

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్పంచ్‌ల సమైఖ్య కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా కోట సర్పంచ్ గర్జుల చిన్నాబాబు, ఉపాధ్యక్షురాలుగా బొడ్డగండి సర్పంచ్ వేమ సంధ్యారాణి, కార్యదర్శిగా చామగడ్డ సర్పంచ్ జర్త కృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శిగా పనసలపాలెం సర్పంచ్ రోలుపల్లి నరసింహమూర్తి, కోశాధికారిగా గుర్తేడు సర్పంచ్ గొర్లె దుశ్యంతుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆదివాసీ కుటుంబాలను ఆదుకోవాలని వినతి

చింతూరు: ఎటపాక మండలంలోని ఎర్రగుంటపాడులో ఆదివాసీలు సాగుచేస్తున్న పోడు భూములు తీసుకునేందుకు అటవీశాఖాధికారులు యత్నిస్తున్నారని, దీన్ని నిలువరించాలని కోరుతూ న్యూ డెమొక్రసీ సంఘం నాయకురాలు కల్పన స్థానిక ఆదివాసీలతో కలిసి ఐటీడీఏ పీవో చైతన్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆయా పోడు భూముల్లో కొన్నేళ్లుగా ఆదివాసీలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారికి పట్టాలు అందజేసి ఆదుకోవాలని కోరారు. ఆదివాసీలతో పాటు సంఘ సభ్యులు ఉన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ చేయించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులకు మలేరియా జ్వరాలు ప్రబలకుండా ముందస్తుగా దోమల మందు పిచికారీ చేసినట్టు చెప్పారు. మురుగునీరు నిల్వ లేకుండా చైతన్యం కల్పించినట్టు చెప్పారు. కిలగాడ ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ అశోక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీలో మధ్యాహ్న భోజన కార్మికులతో సీఐటీయూ నాయకులు బుధవారం సమావేశమయ్యారు. సీటూ మండల కార్యదర్శి శంకరరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలల వేతన బకాయిలు ఉన్నాయని, ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

మండల సమావేశం వాయిదా

కొయ్యూరు: ఎంపీడీవో సీతయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి సభ్యులు గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్టు ఎంపీడీవో తెలిపారు.